

జలపాతం అందాలను తిలకిస్తున్న ఏసీబీ ఐజి

పొచ్చెర జలపాతానికి ఏసీబీ ఐజి

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతాన్ని ఆదివారం ఏసీబీ ఐజి తరుణ్ జోషి సందర్శించారు. ఈ సందర్భంగా జలపాతం అందాలను తిలకించి పరిసరాలను పరిశీలించడం జరిగింది. జలపాతం అందాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం అక్కడే భోజనం చేసి తిరిగి వెళ్లిపోయారు. ఐజి వెంట స్థానిక ఎస్సై శ్రీసాయి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లిని కలిసిన ఆత్మ చైర్మన్

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదివారం బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ కలిశారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటైన కార్యక్రమంలో వచ్చిన మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలపై మాట్లాడారు.

'వేడుకలు ఘనంగా జరుపుకోవాలి'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ కోరారు. ఆదివారం రెవెన్యూ గార్డెన్‌లో ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ మాట్లాడుతూ.. ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేరోజు రెవెన్యూ గార్డెన్‌లో సదస్సు ఉంటుందన్నారు. కొమురంభీం కాలనీ నుంచి ర్యాలీ చేపట్టి కలెక్టర్ చౌరస్తాలోని భీం విగ్రహానికి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంద్ర జైవంత్ రావు, మనోజ్, రేణుక, పుష్పరాణి, ఉయిక ఇందిరా, కుమ్ర రాజు, ఆత్రం గణపతి పాల్గొన్నారు.

● ఆదివాసీలు తరలి రావాలి

బోథ్: ఈనెల 9న మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవానికి 9న ఆదివాసి తెగల ప్రజలు ప్రజాసంఘాలవారు, మేధావులు, విద్యార్థి, మహిళ కార్మిక, కర్షక సంఘాల వారు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రావాలని పిలుపునిచ్చారు.

తీజ్ అధికారికంగా నిర్వహించాలి

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లంబాడి ఐక్యవేదిక బోథ్ మండల అధ్యక్షులు రాథోడ్ సచిన్ పిలుపునిచ్చారు. అంతేగాక జాతీయ పండుగగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

రోగుల సహాయకులకు అన్నదానం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిమ్స్ ఆవరణలోని సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి తన తల్లి లోక దేవుబాయి వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశారు. ఆదివారం సత్రంలో ముందుగా సత్యసాయి చిత్రపటం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. అనంతరం రిమ్స్‌లో రోగుల సహాయకులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా సత్యసాయి ట్రస్టు సభ్యులు ఆయనకు జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రకాష్, గోసెల స్వామి, గోక భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇచ్చోడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి ఇటీవల కోతుల దాడిలో గాయపడి కాలు విరగడంతో పలువురు నాయకులు ఆదివారం ఇచ్చోడలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా రాజ్‌గొండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపురావ్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌లు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసీఫ్, మోరాజ్, ఆశోక్, లక్ష్మణ్, రెండ్ల రాజన్న, ఎండీ అఫ్సర్, రహీమ్, సముల్లఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులను వాయిదా వేయాలి

ఉట్నూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఉపాధ్యాయులు పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే పదోన్నతులు వాయిదా వేయాలంటూ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీటీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్ మాట్లాడుతూ పదోన్నతులలో అడక్వెస్సీ అనే పదాని తీసుకొని వచ్చి గిరిజనులకు రావాల్సిన రిజర్వేషన్లు ఇవ్వకుండా అన్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాథోడ్‌గజేందర్, రవీందర్, నాందేవ్, రవీందర్, షెర్సింగ్ ఉట్నూర్ మండల శాఖ అధ్యక్షుడు జాదవ్‌పవన్, రాష్ట్ర నాయకులు దిగంబర్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నాయకులు రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరితండాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం



గోండుగూడలో పూర్తయిన నూతన పంచాయతీ భవన నిర్మాణం

నిర్మాణ పనులకు.. నిధుల కొరత!

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతూనే ఉన్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు
- పలుచోట్ల నత్తనడకన కొనసాగుతున్న పనులు
- పనులు పూర్తి చేసినా.. రాని నిధులు
- కాంట్రాక్టర్లు, వీటీడీఏ అధ్యక్షులకు తప్పని ఆర్థిక ఇబ్బందులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడు ఆశలు
- జిల్లాలో 115 భవనాల కోసం రూ.23 కోట్ల మంజూరు

ఉట్నూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఐదు వందల జనాభాకు ఒక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. అన్ని గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మిస్తామంటూ ప్రకటనలు చేసింది. అయితే, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లకు ఇప్పటికీ.. నిధులు రాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 'ఇల్లు అలకగానే పండుగ కాదు' అన్న చందంగా ప్రభుత్వ విధానాలు మారడంతో సంబరపడిపోయిన గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు వారి పదవీ కాలం ముగియగానే పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులలేమి ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా.. అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నేటికీ నిధుల లేమి తోనే కొనసాగుతున్నాయి. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా భవనాల నిర్మాణ పనులు అర్థాంతరంగా ఉండిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 229 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.45.80 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 115 నూతన భవనాల నిర్మాణ పనుల కోసం రూ.23 కోట్లు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 52 పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం రూ.10.40 కోట్లు, మంచిర్యాల జిల్లాలో 16 నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.3కోట్లు, నిర్మల్ జిల్లాలో 46 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.9.20 కోట్లు మంజూరు చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నిధులు మంజూరైనా.. పనులు ప్రారంభంగాక నిధులు రాకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని పంచాయతీ భవనాల నిర్మాణదారులు ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు.

నత్త నడకన భవన నిర్మాణాలు

గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని ప్రకటించి అన్ని పంచాయతీల భవనాలు నిర్మిస్తామని ఉమ్మడి జిల్లాలో 229 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏ ఇంజనీర్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు నత్త నడకన నడుస్తున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో అల్లికోరి, అంకాపూర్, అసోదా, ఛీచ్‌ధర్ అతిగుట్ట, జాముల్ధరి, లింగుగూడ, లోహెరా, మాలే బోరేగావ్, తిప్ప, యశ్వంత్ గూడా, చింతల్‌బోరి, గణేష్ పూర్, కారా, కొద్దిగూర్, మసాలా(బి), మసాలాకి, పిట్టగావ్, పోహెరా, పొన్నాల, వరూర్, మారుగూడా, అలాగే బోథ్ నియోజకవర్గంలో అందుగుడ, గోకొండ, గులాబ్ తండా, చింతల సాంగ్వి, గిరిజాయి, కాండ్లి, కోలారీ, సోము గుడా, దామన్‌గూడ, గర్కంపేట్, గోండుగూడ, జాముల్ ధర, లింగుగూడ, కునికాస, బోథ్ చింతగూడ, చింతలబోరి, అందుగుడ, గిరిజాయి, కుంటాల, గొల్లఘాట్, గుబిడిపల్లి, చింతగూడ, దేవుళ్ల నాయక్ తండ, కంటేగావ్, కేశవ్‌గూడ, పార్డి(బి), బీర్సాల గొంది, మంద బొగడ, ధరంపురి, దుబార్ పేట్ (ఏ), శంభు గూడ, సోయం గూడా, బెల్లూరి, దామన్ గూడా, గర్కంపేట్, హర్కాపూర్, గురుజ, ముత్తనూరు తండా, రాగాపూర్, దోషం తండా, విజయపూర్, అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలోని బాబాపూర్,

(తరువాయి 6వ పేజీలో....)

అప్పులకు వడ్డీలు కట్టలేక పోతన్న

: ఆత్రం మోతీరాం, వీటీడీఏ అధ్యక్షుడు, మత్తడిగూడ



ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడా గ్రామపంచాయతీకి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో వీటీడీఏ ఆధ్వర్యంలో పనులు చేపట్టడం జరిగింది. లక్షల రూపాయలు మూడు శాతం వడ్డీకి తెచ్చి భవన నిర్మాణం పూర్తి చేశాను. ఖానాపూర్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా చేయడం జరిగింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నా.. మాకు మాత్రం ఇంకా బిల్లులు రాలేదు. ఫలితంగా ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నాం.

పంచాయతీ భవనాల పనులు కొనసాగుతున్నాయి

: జాదవ్ తానాజీ, ఈఈ, ఐటీడీఏ ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్‌లో రూ.45.80 లక్షలతో 229 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కొక్క భవనం రూ.20 లక్షలతో నిర్మిస్తున్నాం. ఇప్పటివరకు 11 పనులు పూర్తికాగా.. 175 పనులు పురగతిలో ఉన్నాయి. 43 భవనాల పనులు వివిధ కారణాలతో నిలిచిపోయాయి. పనులు చేస్తున్న కొంత మంది కాంట్రాక్టర్లకు కొంతమేర డబ్బులు ఇచ్చాం. ఇంకా నిధులు మంజూరు కాగానే పనులను వేగవంతం చేస్తాం.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిస్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. ఆదివారం మండలం కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో పలు మండలాల నాయకులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి గ్రామాలలో నెలకొన్న సమస్యలు వివరించారు. గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి, నేరడిగొండ, గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పొలంబాటలో రోడ్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఇందులో ఇచ్చోడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల్ గౌడ్, రమేష్, లక్ష్మణ్, వినోద్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● బీఆర్ఎస్‌లోకి పలువురి చేరిక

నేరడిగొండ: మండలంలోని కిష్టపూర్ గ్రామానికి చెందిన నెన్ సింగ్ చౌహన్ 1969లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 56 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు సోలంకి ఉత్తం పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నెన్ సింగ్ చౌహన్ మాట్లాడుతూ 56 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని పార్టీ అభివృద్ధికి ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డానని కానీ ఈ రోజు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి సీఎం చేయడంతో ఆయన సీనియర్లకు తగిన గౌరవం ఇవ్వట్లేదని, ప్రజా పాలన పేరుతో రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేయడాన్ని చూసే పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీలో చేరానని అన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కేవలం రాజకీయ పార్టీ కాదని తెలంగాణ రాష్ట్రం కోసం పుట్టిన శ్రీరామరక్ష అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ద్రోహాలు చేయడం కొత్త కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, కరణ్, గులాబ్, మదన్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక ధ్యానమార్గంతోనే మానసిక ప్రశాంతత

● పులాజీ బాబా తనయుడు ఇంగ్లే కేశవ్ బాబా

తలమడుగు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ధ్యాన మార్గంతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని సద్గురు పులాజి బాబా కుమారుడు ఇంగ్లే కేశవ బాబా అన్నారు. ఆదివారం తలమడుగు మండల కేంద్రంలో పరమాంస సద్గురు పులాజీ బాబా ధ్యాన మందిర కేంద్రం 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పులాజీ బాబా తనయుడు కేశవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక ధ్యాన మార్గము మన పూర్వీకులు మనకు ఇచ్చిన వర ప్రసాదం, అదే భారతీయ సంస్కృతీ, సంప్రదాయమన్నారు. సహజయోగి పులాజీబాబా ధ్యానమార్గాన్ని అనుసరించి ప్రతీ ఒక్కరికి ధ్యానమార్గాన్ని అందించారన్నారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతతో పాటు పలు వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రుల మాట వినాలన్నారు, బాబా అందరికీ ధ్యానం ద్వారానే మోక్షం సిద్ధిస్తుందని, ధ్యానం చేయడం వలన మనిషి తనకున్న అన్ని సమస్యలకు మార్గం తెలుసుకోగలుగుతాడని అన్నారు. కార్యక్రమంలో ధ్యాన మందిర కేంద్రం అధ్యక్షుడు సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు నీలగిరి అశోక్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్, పెళ్లి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ ప్రధాన కార్యదర్శి, కాటిపేలి సునీత రెడ్డి, రాధమ్మ, నర్సింలు, మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్, పెట్కాలే తుకారం, సతీష్, నాందేడ్ వాస్తవ్యుడు శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి తెలంగాణ మహారాష్ట్ర నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు.



బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న ముడుపు మౌనిష్ రెడ్డి, భక్తులు

శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శిక్షణాలను సద్వినియోగం చేసుకుంటు మహిళలు కుటుంబానికి బాసటగా నిలవాలని హన్మకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. సాయివైకుంఠ ట్రస్టు ఆధ్వర్యంలో అందించే మూడు నెలల ఉచిత మగ్గం, టైలరింగ్, బ్యూటీషియన్, ఉన్ని దుస్తుల తయారి శిక్షణను ఆయన ప్రారంభించారు. ముందుగా శిక్షణకు వచ్చిన మహిళలు, యువతులు నృత్యాలు చేసి అలరించారు. అనంతరం ట్రస్టు చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ యాదవ్, నిర్మల్ డీపీఆర్వో విష్ణుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గంగాధర్, శ్రీనివాస్ యాదవ్, రవికాంత్, అనురాథ, శ్రావని, పూజ రాథోడ్, హరిందర్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లు చేస్తే చర్యలు

● ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యువత, గణపతి కమిటీ సభ్యులు బలవంతంగా చందాల రూపేణా వసూళ్లకు పాల్పడితే బాధితుల ఫిర్యాదుల మేరకు వారిపై చట్టపకారం చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలు ఇష్టప్రకారం ఇచ్చిన వాటిని మాత్రమే స్వీకరించాలని ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. బలవంతంగా డబ్బులను, వస్తువులను వసూలు చేసిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడితే వెంటనే డయల్ 100కు తెలపాలని సూచించారు. వినాయక విగ్రహాల తయారిదారులు విగ్రహాల రక్షణ కోసం 24 గంటల కాపలాను నియమించుకోవాలని, ఇప్పటికే వారికి నోటీసులు అందించడం జరిగిందన్నారు.

'బీఎడ్ అభ్యర్థులకూ ప్రమోషన్ ఇవ్వాలి'

నేరడిగొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖలో ప్రస్తుతం చేపడుతున్న ప్రమోషన్‌లలో భాగంగా పీఎస్ హెచ్‌ఎం కోసం డీఎడ్ మాత్రమే కాకుండా బీఎడ్ అర్హతతో ఉపాధ్యాయ ఉద్యోగంలో నియామకం అయిన అభ్యర్థులకు కూడా పీఎస్ హెచ్‌ఎం పోస్టుకు అర్హత కల్పించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్ సింగ్, నర్రా నవీన్ యాదవ్‌లు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకే స్కూల్‌లో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు బీఎడ్ మరొకరు డీఎడ్ అర్హతలతో నియామకం అయ్యారు. కానీ బీఎడ్ అర్హతతో నియమితులైన ఉపాధ్యాయుడు సీనియర్ ఉండగా డీఎడ్ అర్హత గల ఉపాధ్యాయుడు జూనియర్‌గా ఉన్నారు. కానీ ప్రస్తుత ప్రమోషన్‌లలో పీఎస్ హెచ్‌ఎం ప్రమోషన్‌కు జూనియర్ ఉపాధ్యాయుడైన డీఎడ్ అర్హత గల ఉపాధ్యాయుడే పీఎస్ హెచ్‌ఎం గా ప్రమోషన్ తీసుకుంటే బీఎడ్ అర్హత గల సీనియర్ ఉపాధ్యాయుడు జూనియర్ కింద పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టల్ గౌడ్, వివేక్, భవాని, తదితరులు కోరారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

నార్నూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నార్నూర్ సీఐ పి.ప్రభాకర్ అన్నారు. ఆదివారం మహాగాం ఎక్స్ రోడ్ దగ్గర డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు వాహన చాలకులు ఎట్టి పరిస్థితుల్లో బండికి సంబంధించిన ధ్రువ పత్రాలు, లైసెన్ కలిగి ఉండాలనారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా పనులు చేస్తే సహించేది లేదన్నారు. ప్రజల హక్కులు వారి భద్రత ముఖ్యమని పేర్కొన్నారు. వారి వెంట పోలీస్ అధికారులు ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న నార్నూర్ సీఐ ప్రభాకర్



కాలిన గాయాలతో బోథ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిప్పిల్‌దరి గ్రామస్తులు

గ్యాస్ సిలిండర్ లీక్.. ఏడుగురికి గాయాలు

● ముగ్గురి పరిస్థితి విషమం

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పిల్‌దరి గ్రామంలో ఆదివారం రాత్రి వంటగ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఏడుగురు గాయాలపాలయ్యారు. అందులో తొడసం సోనేరావు కుటుంబ యజమాని, తొడసం గంగా ప్రసాద్ కుమారుడు తొడసం బాపురావులకు మంటలు వ్యాపించడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇంట్లో వంట చేసే క్రమంలో గ్యాస్ సిలిండర్ పైపు లీకు కావడంతో పైపును అమర్చేందుకు యజమాని సోనేరావు ప్రయత్నించగా మంటలు వచ్చాయని స్థానికులు తెలిపారు. అయితే మంటలను చూసిన కుమారుడు గంగాప్రసాద్ ఇంటి యజమాని సోనేరావు తమ్ముడు బాబురావు ఇంట్లోకి వెళ్లగా మంటలు వారికి అంటుకున్నాయి. అయితే అక్కడే ఉన్న ఇంటి యజమాని భార్య లక్ష్మి యజమాని తమ్ముడు లక్ష్మణ్ మరో కుమారుడు శేఖర్‌లు మంటలను చూసి ఇంట్లోకి వెళ్లగా వారికి సైతం మంటలు అంటుకున్నాయి. ఇంటి పక్కన కడప మహేష్ విషయం గమనించి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఆయనకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. మంటల్లో చిక్కుకున్న వారు బయటకు రావడంతో గ్రామస్థులు హుటాహుటిన బోథ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వీరందరికీ ప్రాథమిక వైద్యం అందించారు. ఇందులో నుంచి తొడసం సోనేరావు, గంగాప్రసాద్, బాపురావులకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. అయితే, వీరందరినీ మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. సంఘటన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై శ్రీసాయి ఆస్పత్రికి చేరుకుని సంఘటన ఏ విధంగా జరిగిందని బాధితులను ఆరా తీశారు.



పదోన్నతి పొందిన చిత్రును సన్మానిస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదివాసీ అధికారికి గిరిజనుల సన్మానం

ఉట్నూర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్‌లో రెవెన్యూ శాఖలో చిరు ఉద్యోగిగా సంపాదించిన రాయిసిడాం చిత్రు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పదోన్నతి పొందడంతో ఆదివాసీ గిరిజన నాయకులు ఆదివారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉట్నూర్ తహసీల్దార్‌గా పని చేస్తుండగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఉట్నూర్ ఆర్డీఓగా పనిచేసిన రాయిసిడాం చిత్ర కాగజ్‌నగర్ ఆర్డీఓగా పని చేస్తూ జగిత్యాల జిల్లాకు ఆర్డీఓగా బదిలీ అయ్యారు. జగిత్యాల జిల్లాలోని అదనపు కలెక్టర్‌గా పదోన్నతి లభించిన చిత్రును ఆదివారం జగిత్యాలకు తరలివెళ్లి తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు ఆధ్వర్యంలో సన్మానించారు.

జిల్లా కమిటీ అత్యవసర సమావేశం

ఉట్నూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ సర్వసభ్య సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా కమిటీ అత్యవసర సమావేశం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రాహిల్‌ఖాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ మండలంలో కమిటీలు త్వరగా పూర్తి చేయాలని, ప్రజల సమస్యలపై, అవినీతి అక్రమాలపై, ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అదే విధంగా, మానవ హక్కుల ఉల్లంఘనలు మరియు భారత రాజ్యాంగ కల్పించిన హక్కుల సద్వినియోగంపై పని చేయాలని అన్నారు. ఇందులో ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ముజీబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారప గంగారాం, సంయుక్త కార్యదర్శి నేతాజి, తదితరులున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్సీయు భవనం వద్ద మేళాను ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించనున్నారు. నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మానం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన యువకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహా గర్జనను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 4న జరగనున్న ఆసర, చేయూత పింఛన్ దారుల సన్నాహాక మహా గర్జన సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరు కానున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి ప్రేమ్ రాజ్ పిలుపునిచ్చారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యచరణపై నేతలతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, నాయకులు నాందేవ్, విలాస్, నివర్తి, అంజద్, కిషోర్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధుల బహిష్కరణ

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సోమవారం నుండి విధులను బహిష్కరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల కాలంగా తమకు రావాల్సిన వేతన బకాయిలు రావడంలేదని పేర్కొన్నారు. వేతనాలు రాకపోవడంతో తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడ్డ ఎడ్లబండి

● షాంపూర్ వాగుపై వంతెన వద్ద ఘటన ● అడ్డుగోడలు లేకపోవడంతోనే ప్రమాదం ● రైతుకు తప్పిన ప్రమాదం

ఉట్నూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని షాంపూర్ వాగుపై ఉన్న వంతెన వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు ఎడ్లబండి వాగులో పడింది. షాంపూర్ గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ పనులకు ఎడ్లబండి పై వెళ్తుండగా వాగు వద్ద ఉన్న వంతెనపై ఎదురుగా వాహనం రావడంతో ఎడ్లుబెదిరి పోయి వంతెనకు అడ్డుగోడలు లేక పోవడంతో ప్రమాదవశాత్తు బండి అదుపుతప్పి వాగులో పడింది. గోదారిగూడకు చెందిన రైతు జాడిశంకర్‌కు ఎలాంటి గాయాలు కాకపోగా ఒక ఎద్దుకు భారీ గాయాలు కావడంతో జేసీబీ సహాయంతో గ్రామస్థులు ఎడ్లబండిని ఎద్దును బయటకు తీశారు. ఎద్దును పశువుల ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. షాంపూర్ గ్రామ సమీపంలో ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉండడంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని వంతెనకు మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎలాంటి అడ్డుగోడలు లేని షాంపూర్ వాగు వంతెన ఇదే..

'బీఆర్ఎస్‌లో న్యాయం జరగక కాంగ్రెస్ వైపు'

బోథ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన వారికి సరైన న్యాయం జరగకపోవడంతో కాంగ్రెస్ పార్టీ వైపు వస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతలపూడి గ్రామానికి చెందిన బిఆర్‌యస్ సీనియర్ పార్టీ నాయకులు మాధవరావు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆ పార్టీకి నష్టమని అయితే ఎంతోమంది బి ఆర్ ఎస్ పార్టీ వారు కాంగ్రెస్ పార్టీలో చేరిన సిద్ధంగా ఉన్నారని ఆయన రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో మరింత మంది నాయకులు చేర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతల బోరి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

● సంక్షేమ పథకాలకు ఆకర్షితులైపార్టీలో చేరిక

నేరడిగొండ: కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలం కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో 2001 నుండి బిఆర్‌యస్ పార్టీలోలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సోనాల మండలంలోని చింతల బోరి గ్రామానికి చెందిన నాగనాథ్. 24 సంవత్సరాల నుండి పని చేస్తున్న కానీ పార్టీలో ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన చెంది ఆదివారం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగనాథ్ మాట్లాడుతూ జోగి సమాజ్ సంఘం బోథ్ మండల అధ్యక్షుడిగా ఎన్నో సంవత్సరాలు నుండి పని చేస్తున్న గాని గుర్తింపు లేదని జోగి సమాజ్ కుల సంఘ పెద్దల నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతల బోరి సర్పంచ్ రాందాస్. కేంద్ర మాధవ రావు పాటిల్. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి. సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం కోసం పోరాటం'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉపాధ్యాయ రంగాల్లోని సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం యూఎస్పీసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని, ఇప్పటికే మూడు దశాల పోరాటాన్ని ప్రారంభించామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండవ దశ పోరాటంలో భాగంగా ఈనెల 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. రేషనలైజేషన్ జీఓ. 25 అంశాల్లో ఉపాధ్యాయులు తగ్గిపోతున్నారన్నారు. సంఖ్యను కుదిస్తు 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియను స్వాగతిస్తున్నామన్నారు. కానీ ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఒకరిపై హత్యాయత్నం: పరిస్థితి విషమం

గుడిహత్నూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ వ్యక్తిపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన దారుణ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల గుడిహత్నూర్ ఆర్టీసీ బస్టాండ్ మరుగుదొడ్ల నిర్వాహకుడు రాంకుమార్ పాండే అనే వ్యక్తిపై ఆదివారం ఉదయం దుండగులు కత్తితో మెడపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు రక్తపు మడుగులో ఉన్న రాంకుమార్‌ను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు స్థానికులు అతన్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. వర్కర్‌గా పని చేస్తున్న గోలు, రాంకుమార్ పాండే డబ్బుల పంపకం విషయంలో కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, గోలు కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

బోథ్, ఆగస్టు 3 ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన దాసరి లక్ష్మారెడ్డి(68) ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య బోజబాయి ఫిర్యాదులో తన భర్త కడుపు నొప్పి బాధతో బాధపడుతున్నాడని అయితే ఆయన కడుపునిప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు.

కుటుంబ తగాదాలతో ఆత్మహత్యాయత్నం

బోథ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ వల్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇరువురిని బోథ్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసినా అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించడం జరిగింది. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం

సిరికొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మండలంలోని అన్ని గ్రామాల ఆదివాసి నాయకులతో కలిసి కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధికి నోచుకోక అనేక ఇబ్బందులకు గురయ్యాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజలు కోసం అమలు చేస్తుందని అన్నారు.

నిర్మాణ పనులకు.. నిధుల కొరత!

(5వ పేజీ తరువాయి...)

చెరువుగూడ, దొంగ చింత, గోండు గుడ(కె), హీరాపూర్(జె), జైతురామ్ తండా, కామాయిపేట్, మారుగూడా, మత్తడిగూడా, నడంగుడా, నర్సాపూర్ (జె), సాకెర(బి), లింగోజి తండా, ఇంద్రవెల్లి మండలంలోని సమక, పిట్ట బొంగరం, మెండపల్లి, హర్కాపూర్ తండా, గట్టేపల్లి లలో పనులు కొనసాగుతున్నాయి. కాగా తుమ్మగూడ, వాల్గొండ, ఫకీర్ నాయక్ తండ, అంజిలో మాత్రమే పనులు పూర్తి అయ్యాయి. నార్నూర్, గాదిగూడ, సిర్పూర్(యు), జైనూర్, కెరమెరి, తీర్యాని, లింగాపూర్ మండలాల్లోని గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. కాగా.. ఇంకా కొన్ని భవనాల పనులు ప్రారంభం కాకపోగా.. పనులన్నీ మూడేళ్లుగా నత్తనడకన నడుస్తున్నాయి. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లు, వీటీడీఏల అధ్యక్షులు వడ్డీలు కట్టలేక సతమతం అవుతున్నామని పేర్కొంటున్నారు. అటవీ శాఖ అడ్డంకుల వల్ల కాగజ్ నగర్ ప్రాంతంలో లెన్‌గూడా, మాలిని, దహిగావ్ మండలం దిగిడ, సిర్పూర్(టీ) మండలంలోని సుస్మీర్‌లలో పనులు మంజూరైనా.. పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఉట్నూర్ మండలంలోని లింగోజి తండాలో స్థలం అందుబాటులో లేక పనులు ప్రారంభించలేదు. ఇప్పటివరకు జిల్లాలో 115 గ్రామ పంచాయతీలకు గాను ఏడు పంచాయతీల్లో భవనాల నిర్మాణాలు పూర్తికాగా.. 91 పనులు పురోగతిలోనే ఉన్నాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 52 పనులకు గాను ఒకే ఒకటి పూర్తికాగా.. 38 భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. మిగతా 13 భవనాల నిర్మాణ పనుల్లో నాలుగు అటవీ శాఖ అడ్డంకులతో, ఐదు భూములు అందుబాటులో లేక, నాలుగు పనులు ప్రారంభం కాక ఉన్నాయి. అదేవిధంగా మంచిర్యాల జిల్లాలో 16 భవనాల పనులు మంజూరు కాగా.. 11 పురోగతిలో ఉన్నాయి.. మిగతా ఐదు భవనాల పనులు వివిధ అడ్డంకుల వల్ల నిలిచిపోయాయి. నిర్మల్ జిల్లాలో 46 పంచాయతీ భవనాలకు గాను మూడు భవనాలు పూర్తికాగా.. మిగితా 35 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయి. మిగతా 8 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వివిధ అడ్డంకుల వల్ల ప్రారంభం కాలేదు.

అప్పుల పాలై వడ్డీలు కట్టలేక..

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇంజనీరింగ్ శాఖ ద్వారా మొత్తం 229 గ్రామ పంచాయతీ భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గ్రామ గిరిజన అభివృద్ధి సంఘాల ద్వారా చేయాలని ప్రభుత్వం భావించింది. అధికారులు వీటీడీఏలకే పనులు అప్పగించారు. కానీ కొన్ని ప్రాంతాల్లో వీటీడీఏల వద్ద డబ్బులు లేకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు చేరి పనులు చేపట్టారు. కొందరు వీటీడీఏ అధ్యక్షులు సైతం అప్పులు చేసి మరీ పనులు ప్రారంభించారు. ఒక్కొక్క పంచాయతీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడా, బజార్‌హత్నూర్ మండలంలోని తాంద్ర, బేల మండలంలో మసాలా(బి), ఇంద్రవెల్లి మండలంలో అంజి వాల్గొండ, నేరడిగొండ మండలంలోని కుంటాలకే గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ.. పనులు చేసిన వారికి బిల్లులు రాక ఇబ్బందులు పడతున్నారు. పనులు చేస్తున్న వారు సైతం అప్పులు చేసి పనులు చేస్తున్నామంటున్నారు. అంతేగాకుండా వివిధ దశల్లో తమకు డబ్బులు ఇస్తే పనులు త్వరగా పూర్తిచేస్తామని అంటున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని నూతన గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యేవిధంగా నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

'పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు రావని, ప్రతీఒక్కరు పరిశుభ్రత పాటించాలని సామాజికవేత్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ చెత్త బుట్టలను పంపిణీ చేయడంతో పాటు కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ముందుగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీలో పర్యటిస్తు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ చెత్త బుట్టలను అందించారు. ఈ సందర్భంగా ముడుపు మౌనిష్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షకాలం వ్యాధులు ప్రబలే కాలమని తెలిపారు.


కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

» డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు

నిర్మల్‌రూరల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మామడ మండలంలోని జగదాంబ తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆడే కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసి ప్రజారంజక పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మామడ మాజీ ఎంపీపీ బైసింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

నిర్మల్‌రూరల్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్యాంగాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల నలుగురు విద్యార్థులు హనుమకొండలో జరిగే అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారని జిల్లా క్రీడల అధికారి భూక్యా రమేష్ తెలిపారు. అండర్- 14 షార్ట్ పుట్‌లో కృష్ణ, లాంగ్‌జంప్‌లో ప్రకాష్, 200ల మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రదీప్, అండర్- 16 విభాగం షార్ట్ పుట్‌లో సాయినాథ్ ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపిక పట్ల జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ, ఏఎంసీవో శివాజీ, పాఠశాల హెడ్‌మాస్టర్ ఎన్. శైలజ, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

భైంసా వాసికి డాక్టరేట్ ప్రదానం

భైంసా, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన కైలాస్ మహీంద్రా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పురస్కారం పొందాడు. ఆదివారం హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీలో జరిగిన పీహెచ్‌డీ పట్టాల పురస్కార పంపిణీ కార్యక్రమంలో యూనివర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా చేతుల మీదుగా కైలాస్ డాక్టరేట్ పట్టా స్వీకరించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేసుకొని కైలాస్ డాక్టరేట్ పురస్కారం అందుకున్నాడు. కైలాస్‌ను డివిజన్ పరిధిలోని పలువురు ప్రముఖులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మోదీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

» బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మారెడ్డి

భైంసా రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదేశానుసారం బీజేపీ జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మారెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీ హయాంలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, మోదీ పాలనకు విశేషస్పందన లభిస్తుందని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో గత 18నెలల కాలంలో ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్ నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి పనులు తేవడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన బీజేపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలిపారు. కేంద్ర ప్రజానీకానికి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జీలు పాతర్ల నరేష్, పొల్కం సాయినాథ్, నాయకులు, కార్యకర్తలున్నారు.

'గోమాంసం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): గోమాంసం తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ బజరంగ్ దళ్ శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం కడెం నుండి టీఎస్01యూఏ5917 నెంబర్ గల ఆటోలో ఖానాపూర్‌కు తరలిస్తున్న మాంసాన్ని తర్లపాడ్ వద్ద బజరంగ్ కార్యకర్తలు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గోవులను చంపి మాంసాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టుకున్న ఆటోను ఖానాపూర్ పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలానికి వచ్చిన ఎస్సై రాహుల్ ఆటోలో ఉన్న మాంసాన్ని పరిశీలించి పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెటర్నరీ వైద్యురాలు సౌందర్య సంబంధిత పశు మాంసాన్ని పంచనామా చేశారు. చంపబడిన పశువు ఏంటనేది తెలుసుకునేందుకు మాంసాన్ని ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్సై రాహుల్ తెలిపారు.


ఆటోలో తరలిస్తున్న పశు మాంసాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్

సమ సమాజం కోసం పనిచేయాలి

» సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు

బాసర, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు కార్యకర్తలు కులమతాలకతీతంగా సమసమాజం కోసం పనిచేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు అన్నారు. ఆదివారం బాసరలో జరిగిన పార్టీసభ్యుల శిక్షణ తరగతులకు హాజరై ప్రసంగించారు.మతం, మతోన్మాదం, పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం అనే అంశాలపై మాట్లాడారు. ఒక మనిసి ఇంకో మనిషిని దోచుకోని సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పనిచేయాలన్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఆ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని పిలునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నూతన్ కుమార్, కార్యదర్శి గౌతమ్ కృష్ణ, సురేష్, బానోతు సుజాత, పల్లికొండ గంగామణి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాయిడివాడ పంచశిల్పి విశ్వబ్రాహ్మణ సంఘం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించినట్లు పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కట్ట నాగాచారి పర్యవేక్షణలో ఎన్నికలు తెలిపారు. అధ్యక్షుడిగా పొలాస భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సుముఖం అభిషేక్, కోశాధికారిగా సింహారాజు విద్యాసాగర్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో స్థానిక పట్టణ విశ్వబ్రాహ్మణ నాయకులు, నాయిడివాడ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం పలువురు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జమల్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కదిలిలో ఘనంగా శ్రావణ మాసోత్సవాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సైతం కరీంనగర్, ఆదిలాబాద్, మహారాష్ట్ర చంద్రాపూర్, నాందేడ్‌తదితర ప్రాంతాల నుంచి భక్తులు బారీగా తరలివచ్చారు. స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కాళికామాత ఉపాసకుడు విక్రాంత్‌రెడ్డి శ్రీమాతాన్న పూర్ణదేవికి ప్రత్యేక పూజలుచేసి బోనం సమర్పించారు. నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన వైద్యదంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పెంబిలో బెల్లం పటిక పట్టివేత


స్వాధీనం చేసుకున్న బెల్లం, పట్టిక

పెంబి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పట్టికలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అబ్కారి శాఖ సీఐ రంగస్వామి అన్నారు. ఆదివారం పెంబి మండల కేంద్రంలో బెల్లం, పట్టిక విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పలు దుకాణాలలో సోదాలు నిర్వహించామని, 200 కేజీల బెల్లం, 4 కేజీల పట్టికను స్వాధీనం చేసుకొని అంగ గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రంగ స్వామి తెలిపారు. కార్యక్రమంలో అబ్కారీ ఎస్సై వసంత్ రావు, గౌతమ్, రవీందర్, అనుపమ ఉన్నారు.

హామీలు అమలయ్యాకే పాదయాత్ర చేయాలి

● ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు



మాట్లాడుతున్న మాచర్ల రాంబాబు

ఖానాపూర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలవేళ రాష్ట్రప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలుచేశాకే రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు జనహిత పాదయాత్ర చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని వాసవి మాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏ జనానికి హితం చేశారని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనా క్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లు జనహిత పేరిట పాదయాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఎందుకు విడుదల చేయడం లేదో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 103మంది విద్యార్థులు గురుకులాలలో ఎందుకు మరణించారో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జనహిత పాదయాత్ర పేరిట కాంగ్రెస్ చేస్తున్న కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ హిందూ విభాగ కన్వీనర్ శశిధర్, నిర్మల్ జిల్లా కన్వీనర్ మూడపల్లి దినేష్, జిల్ల ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ దుర్గా ప్రసాద్, సాయికుమార్, తదితరులున్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



వేల్పుల లింగన్న (ఫైల్)

నర్సాపూర్(జి), ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తిచెంది ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కుస్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుస్లికి చెందిన తోకల చిన్న సాయిలు (28) చేపలు కోసి విక్రయిస్తూ ఉపాధి పొందేవాడు. మద్యానికి బానిస కావడంతో భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన చిన్న సాయిలు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం తన ఇంటి సమీపంలోని పల్లెప్రకృతి వనంలో ఉన్న క్రీడాప్రాంగణం బోర్డు వద్ద సాయిలు ఉరి వేసుకోగా అదే గ్రామానికి చెందిన ముచ్చల గంగామణి గమనించి సాయిలు అన్న నడిపి సాయిలుకు చెప్పారు. నడిపి సాయిలు ఫిర్యాదు మేరకు నర్సాపూర్(జి) ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి..

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామానికి చెందిన మహాలింగి పోశెట్టి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాలింగి పోశెట్టి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా తగ్గకపోవడం, అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురయ్యాడు. ఉదయం 4:30 గంటలకు పోశెట్టి భార్య వంట గదిలో పని చేసుకుంటూ ఉండగా పోశెట్టి మందు పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి దీన్ని భార్య గమనించి పోశెట్టిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మహాలింగి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

కుక్కల దాడిలో ఎనిమిది మేక పిల్లల మృత్యువాత


మృతిచెందిన మేక పిల్లలు

ముథోల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లోని ముక్తాదేవి గల్లీలో సితోడే పెద్ద గంగాధర్‌కు చెందిన ఎనిమిది మేక పిల్లలు కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. శనివారం రాత్రి గంగాధర్‌కు తన మేకలను కొట్టంలో ఉంచి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారు జామున మేకల కొట్టం వద్దకు వచ్చి చూడగా 8 మేకపిల్లలు కుక్కల దాడిలో చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు గంగాధర్ కోరారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధుడి మృతి

దస్తురాబాద్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘ టన మండలంలోని దేవుని గూడెం శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసు ల వివరాల ప్రకారం.. దేవునిగూడెం గ్రామానికి చెంది న వేల్పుల లింగన్న (80) తన కుమార్తె వద్ద నివసిస్తున్నా డు. లింగన్నకు బీడీ కాల్చే అలవాటుంది. ఎప్పటిలాగే శనివారం రాత్రి బీడీ కాల్చి తన మంచం వద్దే ఉంచాడు. గాలికి చిన్న నిప్పురవ్వలతో మంటలు మంచానికి అంటుకుని మంచంలోనే లింగన్న సజీవ దహనమయ్యాడు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారతీయ కిసాన్‌సంఘ్ మండల కార్యవర్గం ఎన్నిక

తానూరు, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం భారతీయ కిసాన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్న ఈ కార్యవర్గంలో అధ్యక్షుడిగా బాయి జగన్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల రవీంధర్‌రెడ్డి, కార్యదర్శిగా పున్నేడు సాయినాథ్, సహకార్యదర్శిగా బయ్యవాడ్ కిరణ్‌తోపాలు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనంద్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై
అప్రమత్తత అవసరం

● డా.ఫిర్దోస్ జబీన్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ మహాగాం, భైంసా మండలం



ముఖాముఖి

ప్రశ్న: వైరల్ ఫీవర్ సోకకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

జవాబు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వాతవరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పాటు కొత్త నీళ్ల వస్తుంటాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వైరల్ ఫీవర్ సోకే ప్రమాదం ఉంటుంది. ప్రతీ ఒక్కరూ వర్షాకాలంలో వేడి చేసి చల్లార్చిన నీళ్ల తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. శుచి, శుభ్రతను పాటించాలి.

ప్ర: నీటి గుంతల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జ: గ్రామాల్లో మురికి కాలువల్లో నీళ్ల నిలిచే ప్రాంతాల్లో దోమలు పెరగడం సహజం. వాటి నివారణకు క్షేత్ర స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో పాటు పంచాయతీ కార్యదర్శులు నిలిచిన వర్షపు నీటి తొలగింప చేసే పనులు నిర్వహింప చేస్తున్నారు. అపరిశుభ్ర వాతవరణం ఏర్పడకుండా చూస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్ర: ఆస్పత్రిలో రోగులకు సరిపడా మందులు ఉన్నాయా.?

జ: ప్రస్తుతం వ్యాధుల నివారణకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులు గురించి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు.

ప్ర: గర్భిణులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు.?

జ: గ్రామాల్లో ప్రత్యేకంగా గర్భిణులను గుర్తించి కడుపులో బిడ్డ ఎదుగుదల కోసం వారికి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. వారికి ఐరన్, మల్టీ విటమిన్, కాల్షియం తదితర మందులు పంపిణీ చేస్తున్నాం. గర్భిణులకు 7వ నెల వరకు పీహెచ్‌సీలో పరీక్షలు చేసి 8వ నెలలో భైంసా ఏరియా ఆసుపత్రికి చెకప్ కోసం పంపిస్తాం.

● (భైంసా, ఆంధ్రజ్యోతి)



కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



భైంసా జూనియర్ కళాశాలలోని తరగతి గదిలో విద్యార్థులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెరిగిన అడ్మిషన్లు

- గతేడాది జరిగిన అడ్మిషన్లు 2,460
- ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరిగిన ప్రవేశాలు 2,561
- ఫలించిన అధ్యాపకుల ప్రచార కృషి

భైంసా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరములో విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు మొత్తం 101 అడ్మిషన్లు అధికంగా జరిగాయి. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా గత విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో 2,460 మంది విద్యార్థుల అడ్మిషన్లు జరిగాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో గతేడాది కంటే 101 అడ్మిషన్లు పెరిగి మంది విద్యార్థుల ప్రవేశాల సంఖ్య 2,561 చేరుకొంది. ఇంటర్ బోర్డు ప్రవేశాల గడువు పెంచిన నేపథ్యంలో అడ్మిషన్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.

● అడ్మిషన్ల కోసం అధ్యాపకుల విస్తృత ప్రచారం

ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం గాను జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆధ్యాపక బృందాలు ప్రైవేట్,కార్పోరేట్ కళాశాలలకు దీటుగా విస్తృత ప్రచారాన్ని చేపట్టాయి. డీఐఈవో జాదవ్ పరుశురామ్ నాయక్ నేతృత్వంలో అధ్యాపకులు బృందాలుగా ఏర్పడి తమ తమ కళాశాలల పరిధిలోని గ్రామాల్లో అడ్మిషన్ల కోసం చర్యలు చేపట్టారు. పదిలో ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థి ఇంటికి వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లోని సౌకర్యాలు, వసతులను వివరించారు. అంతటా ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికి అధ్యాపక బృందాలను వాటిని అదిగమించి అడ్మిషన్ల కోసం పడరాని పాట్లు పడ్డారు. గతేడాది కంటే అడ్మిషన్లు పెంచాలనే లక్ష్యంతో ఆధ్యాపక బృందం చేసిన కృషి ఫలితంగానే అడ్మిషన్ల పెరుగుదల చోటు చేసుకుంది.

● అడ్మిషన్ల పెరుగుదలలో మిశ్రమ ఫలితాలు..

జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, అడ్మిషన్ల పెరుగుదలలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. గతేడాదితో పోల్చి చూస్తే ఏడు కళాశాలల్లో అడ్మిషన్లు పెరుగగా, మిగతా ఆరు కళాశాలల్లో తగ్గాయి. కుభీర్, తానూర్, సారంగపూర్, నిర్మల్ (బాలుర), మామడ, దిలావర్‌పూర్, కుం టాల మండల కేంద్రాల్లోని జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. ఇక ముథోల్, కడెం, నిర్మల్ (బాలికల), ఖానాపూర్, లోకేశ్వరం, భైంసా కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గింది.

● ప్రవేశాల పెంపునకు మరింత కృషి

(పరుషురామ్ నాయక్, డీఐఈవో, నిర్మల్)

ఇంటర్ బోర్డు ప్రవేశాల పెంపుదల కోసం గడువు పెంచిన నేపథ్యంలో అడ్మిషన్ల సంఖ్య మరింతగా పెంచేందుకు కృషి చేస్తాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలి. ప్రైవేటుతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన అందుతుంది. అన్ని రకాల సౌకర్యాలు, వసతులు మెరుగ్గా ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా ప్రవేశాలు ఇలా..

కళాశాల	గతేడాది ప్రవేశాలు	ప్రస్తుతం ప్రవేశాలు
కుభీర్	134	148
తానూర్	83	103
సారంగాపూర్	146	178
నిర్మల్(బాలురు)	254	289
మామడ	168	196
దిలావర్‌పూర్	158	212
కుంటాల	64	83
ముథోల్	356	347
కడెం	107	102
నిర్మల్(బాలికల)	387	369
ఖానాపూర్	218	210
లోకేశ్వరం	124	100
భైంసా	261	224



భైంసా జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులు



కుంటాల నుంచి పండరిపూర్‌కు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

ప్రయాణికుల సౌకర్యార్థం ఎక్కడికైనా బస్సులు

కుంటాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యం కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సులను నడపనున్నట్లు భైంసా డిపో మేనేజర్ హరి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కుంటాల నుండి మహారాష్ట్ర తుల్జాపూర్ భవాని, పండరిపూర్ పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ప్రయాణికుల కోసం బస్సులు పంపించారు. ఈ బస్సులో ఈ రెండు పుణ్య క్షేత్రాలను దర్శించుకొని తిరిగి వచ్చే వరకు ఒక్కొక్కరికి 2600 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. శ్రావణ మాసం సందర్భంగా మహారాష్ట్రలోని భద్ర హనుమాన్, గ్రిష్ణేశ్వర్ శివాలయాలతో పాటు ప్రయాణికులు కోరితే ఎక్కడి ఆలయాలకైనా బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉంటే బస్సులు పంపించనున్నట్లు ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ భగవంత్ రావు, వీబీవో శ్రీనివాస్ ఉన్నారు.

నమూనా చూడండి.. ఇల్లు కట్టండి

- ఇచ్చోడలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇల్లు



ఇచ్చోడలో ప్రారంభానికి నోచుకొని ఇందిరమ్మ నమూనా ఇల్లు

ఇచ్చోడ, ఆగస్టు, 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్తు కార్యాలయ అవరణలో నిర్మాణం చేపట్టి ఇటీవల పూర్తిచేశారు. ఇంటికి, కిటికీ, తలుపులకు రంగులు, విద్యుదీకరణ పనులు పూర్తి అయినప్పటికి ఇందిరమ్మ ఇల్లు ని ర్మించిన సదరు కాంట్రాక్టరు మాత్రం ఆ ఇల్లును అధికారులకు అప్పగించకపోవడం విశేషం. ఈ విషయమై ఇంచార్జి ఎంపీడీవో సత్యానంద్‌ను వివరణ కోరగా.. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తయింది కానీ కాంట్రాక్టర్ ఇంకా అప్పగించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని సమాధానమిచ్చారు. ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల మంజూరైన ప్రతీ లబ్దిదారులు వచ్చి నమూ నా భవనాన్ని చూసి తమ ఇళ్ల నిర్మాణానికి ఏలాంటి వసతులు, ఏలాంటి నిర్మాణం చేపట్టాలో తెలిసేందుకోసమే ఈ నమూనా భవనం ఉపయోగం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నమూనా ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలలో పాముల సంచారం

- మరుగుదొడ్లు సరిపోక విద్యార్థుల సతమతం
- ఇది ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితి



బోథ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

బోథ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పాఠశాల పక్కనే వ్యవసాయ భూములు ఉండడంతో అందులో నుంచి పాములు వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం పాఠశాల కిటికీలో నుంచి తరగతి గదిలోకి పాము రావడంతో విద్యార్థులు భయాందోళన గురయ్యారు. అంతేగాక వరండాలో సైతం చిన్న చిన్న పాములు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

● రాత్రిపూట తాగుబోతుల హంగామా

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న రాత్రిపూట మందుబాబులు పాఠశాల భవనం పైకి మద్యం సేవిస్తున్నారని పాఠశాల విద్యార్థులు వాపోతున్నారు. మరోవైపు పాఠశాల మైదానంలో మందుబాబులు గుంపులుగా మద్యం తాగి నిరుపేద విద్యార్థులు చదివే ఈ పాఠశాలలో చదువుకున్నవారే. సంస్కారం లేకుండా దేవాలయం లాంటి పాఠశాలలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

టాయిలెట్స్ లేక ఇబ్బందులు



ఆ పాఠశాలలో విద్యార్థులు వివిధ హాస్టల్లో ఉండి విద్యను అభ్యసిస్తున్నాన్నారు. అయితే విద్యార్థుల సంఘటన గుణంగా మరుగుదొడ్లు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో విద్యార్థుల అవసరాలకనుగుణంగా మరుగు దొడ్లు, మూత్రశాలను నిర్మించాలి.

- ఎ.రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

బహిర్భూమికి వెళ్లాలంటే ఇంటికి..



పాఠశాలలో ఉన్నప్పుడు బహిర్భూమికి వెళ్లాలంటే ఇంటికి వెళ్లాల్సిందేనని లేకుంటే హాస్టల్‌కు వెళ్లాల్సి ఉం టుందని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలలో తమ అవసరాలు కనుగుణంగా టాయిలెట్స్ లేవని, కేవలం రెండే టాయిలెట్స్ ఉండడంతో ఇబ్బంది అవుతున్నాం. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

కార్తిక్, విద్యార్థి

ఆదివాసుల అరణ్య రోధన



ద్విచక్ర వాహనాలు కర్ర సహాయంతో వాగుదాటిస్తున్న గిరిజనులు

ఉట్నూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నా ఆదివాసి గిరిజనులకు అరణ్య రోదన తప్పడం లేదు. ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామం పంచాయతీ పరిధిలో ఉన్న వంకతుమ్మ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక అడవి ప్రాంతంలోని గ్రామాల్లో జీవిస్తున్న వంకతుమ్మ, రాజుగూడ గిరిజనులకు ప్రతియేటా వర్షాకాలంలో అవస్థలు తప్పడం లేదు. ఆదివారం వంకతుమ్మ గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజనులు తమకు ఉన్న ద్విచక్ర వాహనాలతో గ్రామాలకు అడ్డుగా ఉన్న వాగు వద్దకు చేరుకుని ద్విచక్ర వాహనాలను కర్ర సహాయంతో గంగాపూర్ వైపు ఉన్న ఒడ్డుకు చేరవేస్తూ ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం వాగుపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నా అటవీ శాఖ అడ్డంకులు ఏర్పడుతుండడంతో ఆదివాసీ గిరిజనులకు ప్రతియేటా ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అటవి శాఖ అనుమతులు ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు.

పచ్చదనం ఆహ్లాదం



భైంసా-కుబీర్ రహదారిలో ఆహ్లాదంగా పెరిగిన చెట్లు

కుబీర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కుబీర్ నుంచి భైంసా వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా గత సర్పంచ్ మీరా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లు పలు గ్రామాలకు ఆదర్శంగా మారాయి. పచ్చదనం అందాలను చూపి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక తెలంగాణ తల్లి చౌక్ నుంచి రహదారికి ఇరువైపుల దట్టంగా చెట్లు పెరగడంతో బాటసారులు, ప్రయాణీకులకు ఆహ్లాదాన్ని ఇ స్తుంది. నాటిన మొక్కలు చెట్లుగా పెరగడంతో రైతులకు బాటసారులకు నీడపట్టున కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఇక అధికారికంగా పొలాల పండుగ

- తాంసి కేంద్రంగా నిర్వహణకు ఏర్పాట్లు



తాంసిలో ఏర్పాట్ల విషయమై చర్చిస్తున్న గ్రామస్థులు

తాంసి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈసారి పొలాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఈ కార్యక్రమాన్ని తాంసి మండల కేంద్రంగా మొదట నిర్వహించేందు కోసం ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర పర్యాటక సలహాదారు తిరుమలరావు తాంసి గ్రామాన్ని సందర్శించి పలు విషయాలపై చర్చించారు. అధికారికంగా చేపట్టే పొలాల పండుగను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు కోసం గ్రామస్థులు ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పొలాల పండుగకు చేపట్టాల్సిన పనుల విషయమే చర్చించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా అధికారికంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయి ఏర్పాట్ల విషయమై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నెల 12న మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు అన్నోజిల శ్రీనివాస్, కృష్ణ, వీరయ్య, ఎల్మ గంగారెడ్డి, రజనీకాంత్, వన్నెల నరేష్, రామన్న యాదవ్, గడ్డం సురేందర్, కళ్యాణ్, రాహుల్, రాఘవేందర్, నరేష్ పాల్గొన్నారు.

పోటాపోటీగా కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలు

ఖానాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్‌లో జనహిత పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకుల దృష్టిలో పడేందుకు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నేతలు పోటీ పడ్డారు. ఆదివారం తెల్లారేసరికి ఖానాపూర్‌లోని ప్రధాన వీధులను ఫ్లెక్సీలతో నింపేశారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ల జనహిత పాదయాత్ర సాగే మండలంలోని బాధనకుర్తి మీదుగా ఖానాపూర్ వరకు రోడ్డు వెంట భారీగా ఫ్లెక్సీలు కనిపించాయి. బాధనకుర్తి వంతెనకు ఇరువైపులా నేతలకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు కాంగ్రెస్ జెండాలను ఏర్పాటు చేశారు. కాగా బాధనకుర్తి నుంచి ఖానాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, నిర్మల్ గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ సహా ఖానాపూర్‌లోని పలువురు నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు వెలిశాయి





ఖానాపూర్‌లో జనహిత పాదయాత్ర సాగే దారి వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వర్షం కోసం పూజలు

తాంసి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో పత్తి మూలకలన్నీ ఎండు బారుతున్నాయి. దీంతో ఆదివారం ఆయా గ్రామాల్లో వ ర్షం కోసం రైతులు పూజలు చేశారు. గ్రామాల్లోని ఆలయా ల్లో లింగాభిషేకం నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 । కనిష్ఠం 25.4



- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్
- బీజేపీ, బీఆర్ఎస్‌లపై నిప్పులు చెరుగుతూ సాగిన ప్రసంగం
- తమ ప్రభుత్వం సాధించింది చెబుతూనే ప్రతిపక్షాలపై మీనాక్షి, మహేష్ కుమార్ గౌడ్‌ల ఫైర్
- ఖానాపూర్‌లో విజయవంతంగా జనహిత పాదయాత్ర
- ఆకట్టుకున్న మంత్రుల ప్రసంగం
- ఆద్యాంతం అన్ని తానై వ్యవహరించిన ఎమ్మెల్యే బొజ్జు
- ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నేతలు



పాదయాత్రలో మహేష్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్, మంత్రులు



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

జనహిత యాత్రతో కాంగ్రెస్‌లో కదనోత్సాహం

ఖానాపూర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదివారం ఖానాపూర్‌లో చేపట్టిన జనహిత పాదయాత్ర ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కదనోత్సాహాన్ని నింపింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులను సిద్ధం చేసేలా నేతలు ప్రసంగించారు. సుర్జాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన నేతలు ఖానాపూర్‌లోని పలు ప్రధాన వీధుల గుండా జనహిత పాదయాత్రను నిర్వహించి పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో ఆదివారం రాత్రి పాదయాత్ర ముగింపు రోడ్ షోను నిర్వహించారు. ఈ రోడ్‌షోలో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ సహామంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, స్థానిక ఎమ్మెల్యే బొజ్జు, మాజీ మంత్రుల ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో కొత్త శక్తిని నింపాయి. ఆదివారం రాత్రి ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో పాదయాత్ర ముగింపు రోడ్‌షో సందర్భంగా నేతలు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కుల సర్వే నిర్వహించి 56.7 శాతం బీసీలు, 17 శాతం ఎస్సీ, 10.5 శాతం ఎస్టీలు ఉన్నట్లు గుర్తించిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి రాష్ట్రపతికి పంపితే అక్కడ ఆ బిల్లు ఆమోదం పొందకుండా మోదీ ముఖం చాటేశారని, అమిత్‌షా ఇంట్లో దాక్కున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శకునిలా దాపురించాడన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతో ఆయన చిలక పలుకులు పలికిస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను కిషన్ రెడ్డి అడ్డుకుంటుంటే ఆ బీసీల ఓట్లతో గెలిచిన మహేశ్వర్‌రెడ్డి, పాయల శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్, ఎంపీ నగేష్‌లు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీసీల మద్దతు లేకుండా బీజేపీ నాయకులు తిరిగి చట్టసభల్లో అడుగు పెట్టగలరా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ మాట ఇచ్చిందంటే ఆ హామీని అమలుచేసి తీరుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌ల కథ ముగిసినట్లేనని ఆయన అన్నారు. బీజేపీ మతం బూచి చూపి రాజకీయం చేస్తోందన్నారు. ఆంధ్రా, బీహార్, యూపీలకు రూ.లక్షల కోట్లు కేటాయిస్తున్న బీజేపీ తెలంగాణకు మాత్రం రూపాయి కేటాయించడం లేదన్నారు. ఈ అంశాలపై కేంద్రమును ప్రశ్నించలేక బీజేపీ ప్రజా ప్రతినిధులు చతకీలపడ్డారని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటున్న కాంగ్రెస్ నాయకులనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌శ్రేణులకే పట్టం కట్టాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్‌లతో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వివరిస్తూ కాంగ్రెస్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరంగా చెప్పాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కేసీఆర్ చేసిన అప్పులకు కోట్లలో వడ్డీలు కడుతున్నాం..

రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ చేసిన రూ.8లక్షల కోట్ల అప్పులకు ఇప్పటివరకు లక్ష 20వేల కోట్ల రూపాయల వడ్డీలు కట్టామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని మాట్లాడినా ఏది నిజమో ప్రజలు తెలుసుకోవాలన్నారు. 80వేల పుస్తకాలను చదివిన కేసీఆర్‌కు మతిపోయిందని మంత్రి ఎద్దేవాచేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్న నాడు ఆంధ్రా మంత్రి రోజా పెట్టిన చేపల పులుసు తిని రాయలసీమను రత్నాల సీమ చేస్తానని గోదావరి, కృష్ణా జలాలను అప్పగించి కేసీఆర్ ఇప్పుడు బనకచర్ల పాపం కాంగ్రెస్‌పై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

కడెం ప్రాజెక్టు తెలవని కేటీఆర్ నాడు మంత్రిగా పని చేయడం మన దురదృష్టం

ఖానాపూర్ ప్రాంతం అంటేనే కాంగ్రెస్ కట్టిన కడెం ప్రాజెక్టు గుర్తుకు వస్తుందని, అటువంటి కడెం ప్రాజెక్టు ఎక్కడ ఉందో తెలవని కేటీఆర్ నాడు మంత్రిగా ఉండడం మన దురదృష్టమని మంత్రి సీతక్క అన్నారు. పేదలకు ఏదైనా చేయాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

పేదలను పథకాలకు దూరం చేశారు..

రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కనీసం రేషన్‌కార్డులు కూడా ఇవ్వకుండా పేద ప్రజలను ప్రభుత్వ పథకాలకు దూరం చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆరోపించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు రేషన్ కార్డుల పంపిణీ చేశామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన ప్రజాప్రతినిధులు

జనహిత పాదయాత్రకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి, నారాయణ రావు పటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ, బోథ్ నియోజ కవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు ఖానాపూర్‌కు తరలివచ్చారు. కాగా జనహిత పాదయాత్ర విజయవంతం చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావులు అన్నీ తామై వ్యవహరించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ప్రజాప్రతినిధులు నాటి ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు తమకు తెలవలేదని, వారి విధానాలు నచ్చకనే కాంగ్రెస్‌లో చేరామని చెప్పడం కొసమెరుపు. పాదయాత్రకు 200మంది పోలీసులతో భద్రత ఏర్పాటుచేశారు. నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల, అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, భైంసా ఏఎస్పీ అవినాష్ ఎప్పటికప్పుడు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జలపాతం వద్ద ఆనందంగా గడుపుతున్న పర్యాటకులు

వాస్తాపూర్ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మామడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామడ మండలం వాస్తాపూర్ జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వర్షాకాలం కారణంగా జలపాతం సౌందర్యం మరింత మెరుగుపడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, యువతీ యువకులు విస్తారంగా తరలి వచ్చారు. చల్లని జలబిందువులు, పచ్చని పరిసరాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారులు నీటిలో సరదాగా ఆడుకుంటే.. యువతీ, యువకులు ఫొటో, వీడియోలు తీస్తూ బిజీగా గడిపారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ

నిర్మల్‌రూరల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడానికి పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు 30 యాక్ట్ అమలులో ఉంటుందని, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టొద్దని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి: మాజీ ఎమ్మెల్యే

కుబీర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ముథోల్ మాజీఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం మంజూరైన ప్రొసీడింగ్ పత్రాన్ని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గ్రామస్థులకు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ నాయకులు సాతం రవికుమార్, ఎగ్గాం సాయినాథ్, డి.రాములు, గంగాధర్, మాజీ సర్పంచ్ గంగాధర్, ఎగ్గాం విఠల్, దేవన్న, బాబు పటేల్, బక్కన్న, భూమన్న రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

5న ఎస్‌జీఎఫ్ క్యాలెండర్ రూపకల్పనపై సమావేశం

నిర్మల్‌రూరల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న 69వ ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర క్యాలెండర్ 2025-26 సంవత్సరం జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల రూపకల్పన, నిర్వహణ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సమాఖ్య, పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి రవీందర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయుల అనుమతి పత్రంతో వాటిని పరిశీలించి పోటీల నిర్వహణలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో తప్పకుండా పాఠశాలల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు.



ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా సుదర్శన యాగం

నిర్మల్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీవాడ శ్రీఅలివేలు మంగ దేవాలయంలో వైభవంగా రెండో సుదర్శన యాగం నిర్వహించినట్లు వేదపండితులు టి.కె.రామకన్నన్ తెలిపారు. ఈ యాగానికి ఆధ్యాత్మికవేత్త క్లాస్‌వన్ కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి, మాజీ దేవరకోట చైర్మన్ ఆమెడ శ్రీధర్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. యాగం అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద దాత ధనానివాళ్ల కుటుంబ సభ్యుల ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, గంధం సుధాకర్, పూసల శ్రీకాంత్, అనిల్ ధనానివాళ్ల, రాజు, రమేష్, రాజశేఖర్, శ్రీహరి శేఖర్, పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

భైంసా, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలని భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యులు డా.బందెల నరేష్, డా.బాషా, మహాగాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఫిర్దోస్ జబీన్ సూచించారు. ఆదివారం భైంసాలో నిర్మల్ జిల్లా వైట్ టీషర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అక్బర్ బాబా నగర్ మజీద్ వద్ద నిర్వహించి ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. వ్యాధులు, వాటి నివారణ చర్యలు, పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు 350 మందికి పైగా రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందచేశారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు షేక్ నుమాన్ నేతృత్వంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో వైట్ టీషర్ట్ క్లబ్ ప్రతినిధులు షేక్ ఇర్ఫాన్, షేక్ సోహేల్, తదితరులు ఉన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

దిలావర్‌పూర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా.ఉత్తమ్ కుమార్ అన్నారు. సమత ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని, ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, నిర్వాహకులు మేనేజర్ రమేష్ కుమార్, శ్రీధర్, నిరంజన్ రెడ్డి శైలేశ్వర్, ధనే నర్సయ్య, సప్పల రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

భైంసాలో భారీ వర్షం

భైంసా, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి) భైంసాలో ఆదివారం భారీవర్షం కురిసింది. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం ఏకధాటిగా 2గంటల పాటు జోరుగా కొనసాగింది. జోరువానతో పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లపై వర్షపు నీరు ఉధృతి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాహనదారులు అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు, పంట చేలలో వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువులు, కుంటలను తలపించాయి. మురికికాల్వల్లోని వ్యర్థాలు, పూడిక, చెత్త అంతర్గత రోడ్లపై పేరుకపోయి అపరిశుభ్ర వాతవరణం ఏర్పడింది. ఫుట్‌పాత్ వ్యాపారుల తమ సరుకులను కాపాడుకునేందుకు పాట్లు పడ్డారు.

భైంసా శివారు కాలనీ ప్రాంతంలో అంతర్గత రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



మహాసభను విజయవంతం చేయాలి

- ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి

నిర్మల్‌రూరల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న దివ్యాంగుల మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి అన్నారు. పట్టణంలోని బుధవార్‌పేట్ అంబేద్కర్ భవన్‌లో మోచి నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ నెల 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం దివ్యాంగుల పెన్షన్ 6వేలు, ఇతర ఆసరా పెన్షన్‌లు 4,000, తీవ్ర వైకల్యం గల వికలాంగులకు 15వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు, మోచి సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, రమేష్, సాయన్న, భూమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నర్సాపూర్(జి), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గన్‌మెన్ కండెల ప్రణయ్ తండ్రి కండెల ముత్యం ఇటీవల మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదివారం తురాటి గ్రామంలోని ప్రణయ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు వెంగళరావు, ఇతర మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముథోల్ అభివృద్ధిపై దృష్టి సారించాలి

- జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికి ముథోల్ మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి

భైంసా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణరావ్‌ను ముథోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, డా.ఎస్.వేణుగోపాల చారిలు విజ్ఞప్తిచేశారు. అధిష్టానం ప్రతిచేపట్టిన జనహిత పాదయాత్రలో పాల్గొనేందుకు ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి ఆదివారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా నిర్మల్ కేంద్రంలో ఇన్‌చార్జీ మంత్రిని మాజీ ఎమ్మెల్యేలతో కూడిన నియోజక వర్గ కాంగ్రెస్ ప్రతినిధుల బృందం కలిసింది. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే లు ఇరువురు నియోజక వర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులను మంత్రి జూపల్లి దృష్టికి తీసుకవెళ్లారు. సమస్యల పరిష్కారానికి, ప్రగతికి సంబంధించి పనులు చేపట్టేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి జూపల్లి ప్రాధాన్యతనను



మంత్రిని కలిసిన ముథోల్ మాజీఎమ్మెల్యేలు డా.వేణు గోపాలచారి, విఠల్‌రెడ్డి

సారం ప్రగతికి బాటలు వేస్తూ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఫారుఖ్ అహ్మద్, మాజీ జడ్పీటీసీలు బాశెట్టి రాజన్న, ఉత్తమ్ బాలేరావ్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ పోతారెడ్డి, పార్టీ ప్రతినిధి చొండి రాజేశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా గజ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం

సోన్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడ్తాల్ ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి పడమటి ముఖద్వారం ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఆదివారం గజ స్తంభం (ఏకశిల) ప్రతిష్ఠాపన కార్యక్రమం వేదమంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఉమ్మడి మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభారాణి, సత్యనారాయణగౌడ్ దంపతులు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయ స్వామి అనుగ్రహంతో ప్రజలకు మేలు కలుగాలని, పాడి పంటలు సమృద్ధిగా పండి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బర్మ రాజనర్సయ్య, పీఏసీఎస్ మంజులాపూర్ వైస్ చైర్మన్ బి. గంగాదాస్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బర్మ రవీందర్, మాజీ ఉప సర్పంచ్ భీమేష్, నాయకులు లక్మారెడ్డి, మద్దెల గంగాధర్, గుర్రం ఆశన్న, బర్మ శ్రీకాంత్, పూజారి రాజేశ్వర్, నాయకులు రవి, గంగన్న పాల్గొన్నారు.

మంకీ రెస్క్యూ సెంటర్ భవితవ్యం గందరగోళం

- వైల్డ్ లైఫ్ యాక్ట్ నుంచి కోతుల తొలగింపు
- పెరిగిపోతున్న నిర్వహణ వ్యయ భారం
- రెస్క్యూ సెంటర్‌ను నడపలేమంటున్న అటవీ శాఖ
- సర్కారుకు అందిన ప్రతిపాదనలు
- ప్రభుత్వ నిర్ణయం పైనే సెంటర్ భవితవ్యం

నిర్మల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న రెండు మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఎత్తి వేసేందుకు రంగం సాధ్యమవుతోంది. ఈ మేరకు మంకీ రెస్క్యూ సెంటర్‌ను మూసి వేసేందుకు అనుమతినివ్వాలంటూ నిర్మల్ జిల్లా అటవీశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం చర్చనీయాంశమవుతుంది. రాష్ట్రంలో ఉన్న రీసెస్ మకాక్ కోతులను వైల్డ్ లైఫ్ యాక్ట్ షెడ్యూల్ 1 జాబితా నుంచి ప్రభుత్వం తొలగించింది. దీంతో ఫారెస్ట్ ఆఫీసర్లు మంకీ రెస్క్యూ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఎత్తి వేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం రీసెస్ మకాక్ జాతి కోతులే నివసిస్తున్నాయి. అలాగే మంకీ రెస్క్యూ సెంటర్ అటవీ శాఖకు ఆర్థికంగా భారమవుతుండడమే కాకుండా ఈ సెంటర్ నిర్వహణ కూడా ఆ శాఖకు తలనొప్పిగా మారింది. నిర్మల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని గండి రామన్న అర్బన్ పార్కులో ఈ మంకీ రెస్క్యూ సెంటర్‌ను గత నాలుగేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఈ సెంటర్ నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడమే కాకుండా అటవీశాఖకు, పశుసంవర్ధక శాఖలకు నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పారు. ఈ కేంద్రాన్ని నిర్వహించేందుకు పశు వైద్యాధికారి ఇతర సిబ్బందిని సైతం నియమించారు. ఈ మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కోతులకు స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ ఆపరేషన్)లు చేస్తున్నారు. స్టెరిలైజేషన్ తర్వాత కోతలకు ఇక్కడ పది రోజుల పాటు ఆశ్రయం కూడా ఇచ్చి వదిలి పెట్టాల్సి ఉంటుంది. రెండేళ్ల పాటు కరోనా కారణంగా ఈ కేంద్రం సక్రమంగా పని చేయలేదు. ఇప్పటి వరకు కేవలం 1550 కోతులకు మాత్రమే స్టెరిలైజేషన్లు చేశారు.



మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఇదే..

భారమవుతున్న నిర్వహణ

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వహణ అటవీ శాఖకు ఆర్థిక భారంగా మారింది. పశుసంవర్ధక శాఖ ద్వారా వెటర్నరీ డాక్టర్‌ను, సిబ్బందిని అలాట్ చేసినప్పటికీ మిగతా నిర్వహణ అంతా అటవీశాఖ చేపడుతోంది. ఆశించిన లక్ష్యం ప్రకారం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, వీడీసీలు తమ ప్రాంతంలోని కోతులను పట్టించి సొంత ఖర్చులతో ఇక్కడి సెంటర్‌కు తరలించాలి. నిధుల కొరతతో పంచాయతీలు, మున్సిపాలిటీలు కోతులను పట్టించే విషయంలో చేతులెత్తేశాయి. దీని కారణంగా 2020 నుంచి ఇప్పటివరకు కేవలం 1550 కోతులకు మాత్రమే ఇక్కడి సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేశారు. ఇక్కడ ఉన్న సౌకర్యాల ప్రకారం ప్రతిరోజు 100 లోపు కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారి వివరిస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు సహకరించకపోతుండడంతో ఇక్కడికి కోతులను తరలించడం సాధ్యం కావడం లేదు. ఆశించిన సంఖ్యలో స్టెరిలైజేషన్ కోసం కోతులను తీసుకురాకపోతుండడంతో డాక్టర్‌తో పాటు సిబ్బంది కూడా ఖాళీగానే ఉంటున్నారు. ఇదిలా ఉండగా కోతుల సంఖ్య మాత్రం రోజురోజుకు పదింతలుగా పెరిగిపోతోంది. ప్రస్తుతం కోతుల సమస్యతో సాధారణ ప్రజలే కాకుండా రైతులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



కోతుల గుంపు దృశ్యం

సమస్యకు పరిష్కారం ఏది?

రాష్ట్రంలో ఉన్న ఏకైక మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను మూసివేస్తే ఇక కోతుల జనాభా నియంత్రణ ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారనుంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు నిధుల కొరత కారణంగా కోతులను పట్టుకునే చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కో కోతిని పట్టేందుకు రూ.1000 నుంచి 1500 వరకు ఖర్చవుతుంది. కోతులను పట్టే వారు కూడా ఎక్కువ సంఖ్యలో లేకపోవడం సమస్యగా మారింది. ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కోతులను పట్టేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే మంకీ రెస్క్యూ సెంటర్ కొనసాగే అవకాశం ఉంటుంది. మంకీ రెస్క్యూ సెంటర్‌ను ఎత్తేస్తే ఇక కోతుల సమస్య పరిష్కారానికి ఎలాంటి మార్గం లేదంటున్నారు. కోతుల సంఖ్యను తగ్గించాలంటే వాటి జనాభాను నియంత్రించాల్సిందే తప్ప ఇతర మార్గాలు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు.